
నేను జీవిస్తున్నాను.— ఆశలు అలలై, కన్న కన్న ఆదర్శాలు గాలిమేడలై కూలిపోయి నన్ను అపహాస్యం చేస్తున్నా; కన్నీరు కరువై హృదయం మూగపోయినా—రేపుమీద తీపితో, భవిష్యత్తు మీద ఆశతో.

ఏనాటికైనా నా ఆశయం నెరవేరుతుందనే ఆశ నాలో మిణుకు మిణుకు మంటున్నది. ఆ ఆశే లేకపోతే నేను జీవించే దాన్ని కానేమో? ఆశలు లేనిదే మానవులు జీవించలేరేమో!

ఎన్ని ఆశయాలు! అవన్నీ బూడిదలో పోసిన పన్నీరులా అయ్యాయి. ఒక్కటీ తను నెరవేర్చలేక పోయింది. తన ఆశలూ, ఆశయాలూ తన పాప అయినా నెరవేరుస్తుంది. ఇక ఆ ఆశే తనకు మిగిలి ఉంది. అదే తను కోరుకునేది. తను అనుకున్న వాటిని ఎందుకు సాధించలేకపోయింది?



# ఆదర్శాలకోసం

పూర్ణవిజయ

పరిస్థితులనే విషవలయంలో చిక్కుకున్న తను వాటి పరిస్థితులను దాటలేకపోయింది. ఆడవారికి ఆశలూ, ఆశయాలూ ఉంటాయనీ, వాటిని ఆచరణలో పెట్టగల సామర్థ్యం ఉందనీ, స్త్రీ అబల కాదు సబలఅనీ ఎన్నో అనుకుంది. కానీ.....

తన ఆశయాలు ఇలా కావటానికి కారణం ఏమిటి? తను స్త్రీగా పుట్టటమా? లేక విధి వైపరీత్యమా?

"ఏవో ఆశయాలు అంటూ వాదిస్తావు. మన మనుకున్న ఎన్నీ నెరవేరతాయా? డాక్టరు కావాలనే ఆశ వదులుకో. హాయిగా పెళ్ళిచేసుకో." చిన్నక్క సలహా!

"చాల్లే, నీవు చేసుకున్నది చాలదూ? నాకు పెళ్ళి వద్దు, ఏమీ వద్దు. నేను డాక్టరునై నా ఆశయం నెరవేర్చుకుంటాను" అంది తను దృఢనిశ్చయంతో.

"ఆహా! డాక్టరై ఈ మహాతల్లి దేశాన్ని ఉద్ధరిస్తుంది. నీవు డాక్టరైతే ఖర్మకాలిందే! బతికిఉన్నవాళ్ళే తమ ప్రాణాలకు తిలోదకాలిస్తారు" అన్నాడు అన్నయ్య వ్యంగ్యంగా నవ్వుతూ.

"నీవు నన్నేం హేళన చెయ్యనక్కరలేదులే. ఆ రోజున అను" అంది తను రోషంగా.

"ఇదుగో, చిన్నీ, లేనిపోని ఆశయాలంటూ పిచ్చిగా ఆశలు పెంచుకోకు. బుద్ధిగా అమ్మా వాళ్ళు చెప్పినట్లు విని పెళ్ళి...."

మాట పూర్తికాకుండానే కస్సుమంది తను. వాదన పెరిగింది. ఆవేశంతో ఊగిపోయారు తను, అన్నయ్యా. తనను ఎన్ని అన్నా సహించగలదుకానీ, తన ఆశయాన్ని హేళనచేస్తే భరించలేదు. ఆవేశంతో మైమరిచిన తను అన్నను బలంగా నెట్టింది. అంతే!

తన ఆవేశానికి ప్రతిఫలంగా అన్నయ్య కాలు అవుడు అయింది. తన తొందరపాటుకు నొచ్చుకుంది. తన వల్ల అన్నకు అంగలోపం వచ్చిన నందుకు కుమిలిపోయింది.

ఇంట్లో అందరినీ ఎదిరించి, నాన్నను ఒప్పించి మెడిసిన్ సీటుకు అప్లైచేసింది. నాన్న సీటు విషయమై కనుక్కోనేందుకు వెళ్ళారు.

తన సంతోషానికి పగ్గాలు లేవు. తన మనసు దూదికన్నా తేలికై గాలిలోకి ఎగురుతున్నట్లు అనిపించింది. తను డాక్టరు! ఓహ్! తన ఆశయం నెరవేరుతున్నది. తను ప్రజాసేవ చేస్తుంది. బీదా సాదా అనేభేదం లేకుండా అందరికీ ప్రాణ దానం చేస్తుంది. తను విదేశాలకు వెళ్తుంది. అక్కడ ఎన్నో నేర్చుకుని తన దేశానికి తిరిగి వస్తుంది, గర్వంగా. అప్పుడు తనను చిన్నక్కా, అన్నయ్యా ప్రశంసిస్తూ "నీ మాట నెగ్గించుకున్నావు మొత్తానికి. అసాధ్యురాలివి!" అంటారు.

తనకు సీటు వచ్చిందట. ఎంత చల్లనివార్త తెచ్చారు నాన్న!

"నీవేం డాక్టరువవుతావని అన్నారే? చూడండి —నాన్న ఫోన్ చేశారు. నాకు సీటు ఉందిట.

**ఆశయాలు అందరికీ ఉండవు ఉన్నా నెరవేరడానికి మార్గాలు కరవు అవుతాయి. సాఫల్యం ఎక్కడో అరుదుగా కాని సిద్ధించదు. అక్కడ సహితం ఆశయసిద్ధి అపేక్షించి అంతా పోగొట్టుకొనడానికి సిద్ధపడడం అనివార్యం అవుతుంది. ఏమైనా ఆశయాలులేని జీవితం వాసనలేని పుష్పం.**

ఇప్పుడు చెప్పవే, చిన్నక్కా! నా ఆశయం నెరవేర్చుకుంటానా, లేదా?" గర్వంగా, ఆనందంగా పొంగిపోతూ అందరికీ చెప్పింది తను. అబ్బ! నాన్న ఇంకా రారేం? ఎన్నో అడగాలి. రేపే తను వెళ్ళాలి. ఎలా ఉంటుందో ఆ వాతావరణం?

ఊహలలో తేలిపోతున్న తనకు కారుహారన్ వినిపించింది. నాన్న వస్తున్నారు. పరుగు పరుగున వరండాలోకి వచ్చింది. ఆ దృశ్యం చూసిన తను కెవ్వుమంది. కళ్ళు తిరిగాయి. శరీరం తూలిపడిపోయింది తను.

కళ్ళువిప్పి చూసింది. అంతా అచేతనంగా ఉన్నారు. కన్నీరు ప్రవహిస్తున్నది. అంతవరకు ఆనందం పొంగి పొరలిన హృదయంలో అంతులేని దుఃఖపుటలలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. బరువెక్కిన హృదయంతో చివరిసారిగా నాన్న భౌతిక కాయానికి అంజలి ఘటించింది తను.

"లాభంలేదమ్మా, ఒక్క రోజు ముందుగా వస్తే నీకా సీటు లభించేది" ప్రిన్సిపాల్ మాటలు విని నిరాశతో తిరిగి వచ్చింది తను. ఇంతకూ తను దురదృష్టవంతురాలు.

మరుసటిసంవత్సరం ప్రయత్నించింది.పొలాలు పొంగులువారే తన ఆశయాల ఆవేశాలు అమ్మ కన్నీటితో చల్లారిపోయాయి. తత్ఫలితంగా తను శ్రీమతి అయింది. అయినా తన ఆశయాన్ని చంపుకోలేక పోయింది. వారికి తన కోరిక చెప్పి ఎంతో ప్రాధేయపడింది. తన మాటలు విన్నవారు విస్తుపోయారు.

"చూడు, సుశీ! నీవు గృహిణిగా ఉండి నీ ఆదర్శాల కనుగుణంగా నీ ఇంటిని మార్చుకో. వివాహం అయిన నీకు చదువుతో పొత్తు కుదరదు. చదివినా వినోదంగా చూస్తారు మన ఇళ్ళల్లో. నా మాట విను" అన్నారు లాలనగా.

మౌనంగా లోపలికి వెళ్ళింది. తన నెవ్వరూ అర్థంచేసుకోరు. ఒక్కరూ తనకు ప్రోత్సాహమివ్వరు. తన ఆశయం వీళ్లకు విడ్డూరంగా కనిపిస్తుంది. మొదటినుండి అక్కలు, అన్న, అమ్మ—అంతా వ్యతిరేకమే. వారెవ్వరూ ఇవ్వని ప్రోత్సాహం భర్త ఇస్తారని, తను డాక్టరవుతుందని ఎన్నో ఆశలు పెంచుకుంది కాని—

అటు కన్నవారూ తనను అర్థంచేసుకోలేక పోయారు; ఇటు కట్టుకున్నవారూ అదేస్థితిలో ఉన్నారు. ఛీ! ఎందుకీ పాడుబతుకు? అనుకున్న ఒక్క కోరికే తీర్చుకోలేకపోయింది. తను ఏనాటి

## పూర్ణవిజయ

కైనా డాక్టరు కాగలదా? కన్నీరు కట్టలు తెంచుకుంది. వెక్కివెక్కి ఏడ్చింది తను.

"సుశీ! ఏమిటలా మారిపోతున్నావు, రోజు రోజుకూ? నీ బాధ ఏమిటో నాకు చెప్పవూ?" ప్రేమగా అడిగారు.

"ఎలా మారుతున్నానునేనా బాధ ఎవరికి కావాలి, అయినా?" అంది నిర్జీవంగా నవ్వుతూ తను.

"అదేమిటి, సుశీ, అలా అంటావు? నీ బాధ నా బాధ కాదా? చెప్పు. నీకేం కావాలి?"


తలతిప్పింది, ఏమీ అక్కర్లేదు—అన్నట్లు. కన్నీరు సుడులు తిరిగింది.

"పిచ్చి సుశీ! నీ బాధ నా కర్థమయింది. నీ ఇష్టప్రకారమే చదువుకుందువుగాని. దీనికోసం ఇంతగా బాధపడతావా? ఏదీ—నవ్వు" అంటూ తన కన్నీరు తుడిచారు.

తను మెడిసిన్ చదవబోతున్నదని తెలిసి అత్తగారూ, ఆడపడుచులూ, మామగారూ, మరుదులూ—అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు. అమ్మా, అక్కలూ తననొక మొండిఘటంగా లెక్కకట్టారు. అందరికీ తన ఆశయం వింతగా, అపహాస్యంగాఉంది. భార్యచేతిలో కీలుబొమ్మంటూ వారిని ఎన్నో అన్నారు—అత్తయ్యా వాళ్ళు. తన మనసు విలవిలలాడింది.

పోనీ, మానేస్తే? తను కన్న కలలు ఫలించబోతుంటే మానేయటమా? ఊహుఁ! తన మాట నెగ్గాలి. వారి ప్రోత్సాహం, కాలేజి వాతావరణం తనలోని ఉత్సాహాన్ని పురికొల్పాయి. వారూ, తనూ వేరువేరుగా ఉన్నారు. ప్రయత్నంమీద తను ఉన్నచోటికే వచ్చారు. ఇంటిపనికీ, కాలేజికీ సమన్వయం కుదరలేదు. వారి సహకారంతో రోజులు గడిచి పోతున్నాయి.

ఆ నాడు తను వచ్చేసరికి వారు మూలుగుతున్నారు. కంగారుగా చెయ్యివేసి చూసింది. అక్కడక్కడా పచ్చని పొక్కులు. శరీరం కాలిపోతున్నది. తన గుండె దడదడలాడింది. కాలేజి మానెయ్యటానికి వీలులేదు. పరీక్షలు దగ్గరలో ఉన్నాయి. కాలేజీకి వెళ్ళేవరకూ సేవచేస్తూ, పని మనిషిని ఉంచి వెళ్ళింది. ఆయనకు రోజు రోజుకూ జ్వరం హెచ్చుతున్నది. శరీరంనిండా సందులేకుండా కురుపులు. విపరీతంగా బాధ పడుతున్నారు. తనకు కాలూ చెయ్యీ ఆడలేదు. మనసు వికలమైపోయింది. అత్తగారూ వాళ్ళు రారు. అమ్మకు ఫోన్‌చేస్తే—పెద్దక్క పురిటికి వచ్చిందని తెలిసింది. విధిలేక అత్తగారిని రమ్మని



# నట్టనడి సంద్రాన

చిత్రం—కె. లింగారెడ్డి (హైదరాబాదు)

కబురు పెట్టింది. వారి సమాధానం తనకళ్లలో నీరు నిలిపింది.

అలాగే వెళ్లి వస్తున్నది తను. ఆయన జ్వర తీవ్రత హెచ్చింది. రేపే పరీక్ష! ఏమిటి తనకీ శిక్ష! తనేంపాపం చేసిందని తనపై విధి ఇలా పగబడుతున్నది? ఆశయాలు ఉండటం తప్పా? అవి నెరవేర్చుకోవాలని ప్రయత్నించటంనేరమా? అత్తగారికీ వాళ్లకూ తనమీద ఎందుకంత కక్ష? తను చదువుకుంటున్నాననే ఈర్ష్యా? హృదయం బరువెక్కుతున్నది.

"అబ్బా!" బాధగా ఆయన మూలుగు తన కర్ణపుటాలను ఛేదిస్తున్నది. తనకళ్లలో నీరు నిలిచింది. "దాహం" అన్నారు. మెల్లిగా పళ్లరసం తీసి ఇచ్చింది.

"సుశీ! రేపేకదూ, పరీక్ష?" హీనస్వరంతో అడిగారు.

తల ఊపింది తను.

"వెళ్లు, సుశీ! చదువుకో. నాకోసం నీవేం కంగారు పడకు. అదే నయం అవుతుంది. పని మనిషి ఉందిగా, చూడటానికి? వెళ్లు" అన్నారు.

మనసులో గునపాలు పెట్టికొట్టినట్లయింది. కంటికి రెప్పలా కాపాడవలసిన బాధ్యత ఉండి, తను పరీక్షకు పోవాలా? స్త్రీకి పతికంటే ఏం కావాలి? అందరిలా ఆయనా ఈ మాత్రమేనా, అర్థంచేసుకుంది? వారి ఆరోగ్యమే తనకుభాగ్యం. వారి సౌఖ్యమే తనకు ఆనందం. వెధవ పరీక్షలకు పోకపోతే ఏం?

"నేను పరీక్షకు వెళ్లదలుచుకోలేదు." చెప్పింది తన నిర్ణయం.

"ఏమిటె, సుశీ, నీ వనేది?" ఆశ్చర్యంగా అన్నారు.

"మీ ఆరోగ్యంకంటే ఎక్కువనుకున్నారా, నాకా పరీక్షలు? అందరిలా మీరూ నన్ను ఇలాగే అర్థంచేసుకున్నారా? నాకు కావలసింది మీరు. మీరే! నేనిక చదవను." వెక్కివెక్కి ఏడుస్తూ పరుపుమీద వాలిపోయింది తను, వారు పిలుస్తున్నా వినిపించుకోకుండా.

"మీ డాక్టరు వదినొచ్చిందిరోయ్" అంటున్న అత్తగారూ; "అదేమిటమ్మా, వదినా, మాలో డాక్టరులేని కొరత తీరుస్తా వనుకున్నామే? మా ఆశలన్నీ నిరాశ చేశావు!" అని ఎత్తిపొడుస్తున్న ఆడబిడ్డలూ; "చిన్నీ, ఏవో ఆదర్శాలు, ఆశయాలు అంటూ లేనిపోని చిక్కులు కొని తెచ్చుకున్నావు. ఆడది అబల. నే చెబితే ముందు విన్నావా?" అంటున్న చిన్నక్కా; "అయిందిగా, డాక్టరు, మన చిన్ని!" అని నవ్వుతున్న అన్నయ్యా; "పిచ్చి తల్లి! ఆశయాలు అంటూ ఉండటం మంచిదే కానీ అవి నెరవేర్చుకొనే అవకాశాలు మనకు ఉండాలి. బాధపడకు" అని ఓదార్పుగా అంటున్నట్లు నాన్నా.

తల తిరిగిపోసాగింది. ఆడవారికి ఆశయాలు ఉండవా? వాటిని నెరవేర్చుకొనే అవకాశమే వారికి లభించదా? తనలాగే అందరూ ఇలానే కుమిలి పోతుంటారా?

తను చిన్నప్పటినుండి ఎన్నో ఊహించుకుంది. తను డాక్టరు కావాలని ఎంతగానో ఆరాటపడింది. తను కట్టుకున్న ఆశలన్నీ పేకమేడలై, పరిస్థితులనే గాలికి కూలిపడిపోయాయి. వాటి తాలూకు తనకు మిగిలిందేమిటి?

వెచ్చని కన్నీరు బుగ్గల మీదుగా జాలువారింది.

"సుశీ! మన పాప ఏమంటున్నదో విన్నావా?" ఆయన మాటలు విని—

"ఏం పాపా! ఏమంటున్నావు?" అన్నాను, పాపను దగ్గరకు తీసుకుంటూ.

"డాక్టరు నౌతానమ్మా, మందులిస్తా!" ముద్దుముద్దుగా చేతులుతిప్పుతూ నా పాప అంటుంటే నా హృదయం పొంగిపోయింది.

"డాక్టరువౌతావా, పాపా?" అంటూ ఎత్తుకొన్నాను. ఆ మాటనే పదే పదే అనిపించుకొని ఆవేశంగా ముద్దుపెట్టుకున్నాను.

బంగారుతల్లి డాక్టరు! పాపకు ఇంత చిన్నతనం నుండే డాక్టరు కావాలనే ఆశ! తన ఆశలాగే పాప ఆశకూడా... ఊహూఁ!... అలా ఎన్నటికీ కాదు. 'నా తల్లి డాక్టరు అవుతుంది.' ఎవ్వరూ ప్రోత్సహించేవారులేక, పరిస్థితులు అనుకూలించక తన ఆశ నిరాశ అయింది. కానీ, పాపకు అలా కాదు. ప్రోత్సహించే తల్లిదండ్రులు ఉన్నారు. తను పొందలేని ఆనందాన్ని, తను సాధించలేని ఆశయాన్ని పాప సాధిస్తుంది.

హృదయం తేలికయింది. సంతోషంతో పొంగిపోయింది నా మనసు. నా పాప డాక్టరు కావాలి. ఆ రోజుకోసం, నా ఆశయాలు ఫలించే ఆ బంగారు దినంకోసం ఆశతో నిరీక్షిస్తున్నాను. భవిష్యత్తుమీద కొండంత ఆశతో జీవిస్తున్నాను—ఆరోజు కోసం. ★